క్లుప్తంగా

అంబేడ్కర్ చిత్రపటం బహూకరణ



బోధన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గురువారం రెంజల్ మండల కేంద్రంలోని దళిత సంఘాల నాయకులు కెనరా బ్యాంక్ అధికారులకు అంబేడ్కర్ చిత్ర పటాన్ని బహూకరించారు. నాయకులు బాలాజీ, సంతోష్, మహేందర్, నడ్పి గంగాధర్, పోశెట్టిలు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



బోధన్: రెంజల్ మండలంలోని బొర్గాంలో నిరుపేద ముస్లిం మహిళలకు గురువారం రంజాన్ కానుకలను స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ వాణి సాయిరెడ్డి, ఉపసర్పంచ్ ఫిరోజుద్దీన్, సొసైటీ చైర్మన్ మొయినుద్దీన్, డైరెక్టర్ ఖాదీర్ పాషా, వార్డు సభ్యుడు నిజాం పటేల్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

చందూర్ మండలం లక్ష్మాపూర్‌లో..

రుద్రూర్: చందూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామానికి ప్రభుత్వం సరాఫరా చేసిన రంజాన్ కానుకలను స్థానిక సర్పంచ్ బొడ్డోళ్ల సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశ్విని సాయిలు, వార్డు సభ్యులు బాబు, అజీం, తదితరులు పాల్గొన్నారు.

వర్ని మండల కేంద్రంలో..

వర్ని: మండల కేంద్రంలో ముస్లిం మైనార్టీలకు గురువారం ఎంపీడీవో బషీరుద్దీన్ రంజాన్ కానుకలను అందజేశారు. కార్యక్రమంలో వర్ని ఎంపీపీ మేక శ్రీ లక్ష్మీ వీర్రాజు, పాత వర్ని సర్పంచ్ ఎంబడి పద్మ, వర్ని సహకార సంఘం అధ్యక్షులు నామాల సాయిబాబా, నాయకులు వీర్రాజు, గిరి పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో గురువారం అగ్నిమాపక శాఖ వారోత్సవాల వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆర్డీవో శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ పెరుగుతున్నాయని ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. ఫైర్ స్టేషన్ అధికారి మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు లిల్లిపుట్ విద్యార్థి



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలకు చెందిన హర్షిత్, సైనిక్ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపల్ దాసు గురువారం తెలిపారు. లిల్లిపుట్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న హర్షిత్ ప్రత్యేక శిక్షణ ద్వారా రక్మాపూర్‌లోని సైనిక్ పాఠశాలకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాలలో హర్షిత్‌ను సన్మానించారు.

నలంద విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్ విద్యార్థులు గ్రాండ్ ఒలంపియాడ్ ఐఐటీ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపల్ సాగర్ గురువారం తెలిపారు. ఈ నెల 16న హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఈ–అభ్యాస్ ఐఐటీ అకాడమీ వారు ఘనంగా సన్మానించనున్నట్లు చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను యాజమాన్యం అభినందించింది.

ఆదర్శ వివాహం

బోధన్: సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన రేఖ, బాలరాజ్ దంపతుల కూతురు భావన, ఇదే గ్రామానికి చెందిన గంగన్ నడ్పి భూమయ్య, బాలమణి దంపతుల కుమారుడు కల్యాణ్ కుమార్‌ల ఆదర్శ వివాహం నిరాడంబరంగా జరిగింది. గురువారం బోధన్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు చిన్న పర్వయ్య పెళ్లి ప్రక్రియను ఎలాంటి ఆడంబరాలకు పోకుండా కేవలం పూలదండలు మార్చుకోవడం ద్వారా జరిపించారు. అతిథులుగా మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ల సరిత, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, న్యూడెమోక్రసీ నేత పాపయ్య, వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు నింబూరి గౌతం ప్రసాద్, ఏఐకేఎంఎస్ నేత వేల్పూర్ భూమయ్య హాజరై ఆశీర్వదించారు.

అసంపూర్తి వంతెనకు నిధులు

- అదనంగా రూ. 40 లక్షలు మంజూరు
- దూదిగాం రైతులకు తీరనున్న కష్టాలు



దూదిగాం శివారులో కాకతీయ కాలువపై నిర్మాణ దశలో ఆగిపోయిన వంతెన

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం శివారులో కాకతీయ కాలువపై నిర్మిస్తున్న అసంపూర్తి వంతెనకు అదనంగా రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. 2018లో కాకతీయ కాలువపై 3.9 కిలోమీటర్ వద్ద వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.95 లక్షల నిధులను మంజూరు చేసింది. అదే సంవత్సరం పనులకు శంకుస్థాపన చేశారు. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు నత్తనడకన సాగాయి. అంతే కాకుండా చివరికి పనులు చేపట్టకుండానే కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో పనులు చేపట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఐదేళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. కాకతీయ కాలువ అవతలి వైపు దూదిగాం గ్రామం ఉంటే ఇవతలి వైపు సాగు భూములు ఉన్నాయి. దీంతో పంట భూములకు వెళ్లాలంటే జాతీయ రహదారి–44 గుండా వచ్చి వెళ్లాలి.

నిబంధనల ప్రకారం కాలువపై ప్రాజెక్ట్ నుంచి 4 కిలోమీటర్ల దూరంలోనే వంతెన నిర్మించాలి. కానీ రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి 3.9 కిలోమీటర్ వద్దనే మంజూరు చేయించారు. ప్రస్తుతం అదనంగా మరో 40 లక్షల నిధులను మంజూరు చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల ఉండదు. పనులు చేపట్టడానికి అనువుగా ఉంటుంది. వెంటనే పనులు ప్రారంభిస్తే జూలై వరకు పనులు పూర్తి చేయవచ్చని రైతులు అంటున్నారు.

మంత్రికి రుణపడి ఉంటాం

కాకతీయ కాలువ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయటానికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీని కోసం రూ.40 లక్షల నిధులు అదనంగా కేటాయించారు. రైతులందరం, గ్రామస్తులం రుణపడి ఉంటాం.

– లక్ష్మి, ఎంపీటీసీ, దూదిగాం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే లాభసాటి ధర



సాలూరలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సావిత్రి, సొసైటీ చైర్మన్ జనార్ధన్

బోధన్‌రూరల్(బోధన్): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యానికి లాభసాటి మద్దతు ధర లభిస్తుందని ఎంపీపీ బుద్దె సావిత్ర, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్‌లు అన్నారు. గురువారం సాలూర సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఏ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,060లు, బీ–గ్రేడ్‌కు రూ.2,040లు ధర లభిస్తుందన్నారు.

జైతాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎడపల్లి(బోధన్): జైతాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రజిత యాదవ్, సింగిల్ విండో చైర్మన్ నారాయణ చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ పద్మ, తహసీల్దార్ ఆకుల శేఖర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజేందర్ రెడ్డి, ఎల్లయ్య యాదవ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు

కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



18వ వార్డులో కంటి శిబిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, తదితరులు



కల్దుర్కిలో పరీక్షలు చేసుకుంటున్న సర్పంచ్ నారాయణ రావు, పాల్గొన్న ఎంపీపీ సావిత్రి

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, అద్దాలు కూడా అందజేస్తామన్నారు. స్థానిక కౌన్సిలర్ వనం శేఖర్, మున్సిపల్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్దుర్కిలో శిబిరం ప్రారంభం

బోధన్‌రూరల్(బోధన్): కల్దుర్కి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ బుద్దె సావిత్రి, సర్పంచ్ నారాయణ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలు కంటి పరీక్షలు చేసుకొని వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవాలన్నారు. ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ శరత్, గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

పాత వర్నిలో..

వర్ని: పాత వర్ని గ్రామంలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి ప్రారంభించారు శిబిరానికి వచ్చే రోగులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, వర్ని సర్పంచ్ పద్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



రెంజల్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యులు



ఎడపల్లిలో.. డాక్టర్ వినీత్ రెడ్డి

- రెంజల్ పీహెచ్‌సీలో ప్రయోగాత్మకంగా అవగాహన

బోధన్: అపస్మారక స్థితిలో పడిపోయి నాడీ, శ్వాస పని చేయని స్థితిలో ఉన్న వ్యక్తి సీపీఆర్(కార్డియో పల్మనరీ రెసస్సిటేషన్) చేసి ప్రాణాలు కాపాడవచ్చని రెంజల్ పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్యులు, సిబ్బంది సీపీఆర్ ప్రక్రియపై ప్రయోగాత్మకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఆర్ ప్రక్రియ పాటించాల్సిన విధానాన్ని వివరించారు.అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి ఛాతీపై 30 సార్లు ప్రెషర్స్‌తో పాటు రెండు సార్లు శ్వాస ప్రక్రియ అందించాలన్నారు. ఇలా కనీసం రెండు నిమిషాల్లో 150 ప్రెషర్స్, 10 శ్వాస ప్రక్రియలను అందించి ఎడమ ప్రక్కన పడుకోబెట్టాలని సూచించారు. 108 అంబులెన్స్ వచ్చే వరకు ప్రక్రియ కొనసాగించాలని చెప్పారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పవన్ కుమార్, వినయ్ కుమార్, ప్రమోదిత, హెచ్‌ఈవో శ్రావణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎడపల్లి ఐకేపీ కార్యాలయంలో..

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి ఐకేపీ కార్యాలయంలో గురువారం సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎడపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఆశా వర్కర్లు, ఐకేపీ మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వినీత్ రెడ్డి, హెచ్‌వోడీ రాములు, ఐకేపీ ఏపీఎం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాధనోద్యమంలో కలిసి రావాలి



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని న్యాయవాదులు కోరారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా గుర్తించాలని పేర్కొన్నారు. జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 116వ రోజుకు చేరాయి.

కానిస్టేబుల్‌కు సన్మానం

నవీపేట: నవీపేట పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చౌహాన్ రాజు బదిలీపై వెళ్లడంతో ఎస్సై రాజారెడ్డి గురువారం సన్మానించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన చౌహాన్ రాజు మూడు సార్లు కేపీఐ అవార్డును గెలుచుకున్నాడని, ఇతరులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చౌహాన్ రాజు ఇందల్వాయి పీఎస్‌కు బదిలీ అయ్యారు.

కేసు వాయిదా పడటం విచారకరం

భీమ్‌గల్: ఉపాధ్యాయుల బదిలీలపై హైకోర్టులో నడుస్తున్న కేసు జూన్ 13కు వాయిదా పడటం విచారకరణమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా పదోన్నతులు లేక అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోతున్నారని, పాఠశాలల్లో ఖాళీ పోస్టుల వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతులు పూర్తి చేసి ప్రత్యక్ష నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

నిధుల గోల్‌మాల్‌పై బాధ్యత వహించాలి



సభలో కార్యదర్శిని ప్రశ్నిస్తున్న సభ్యులు

- కార్యదర్శి బాధ్యతారాహిత్యంపై పొతంగల్ ప్రత్యేక మహాజన సభలో సభ్యుల ఆగ్రహం

రుద్రూర్: పొతంగల్ విశాల సహకార సంఘంలో నిధుల గోల్‌మాల్‌పై సంఘ కార్యదర్శి, అధ్యక్షుడు బాధ్యత వహించాలని సభ్యులు డిమాండ్ చేశారు. గత నెల నిర్వహించిన మహాజన సభలో ఇన్‌కమ్ ట్యాక్స్, సేల్ ట్యాక్స్ చెల్లింపులు, పీఎఫ్, సభ్యులకు రావాల్సిన రిబేట్‌కు సంబంధించిన నివేదిక సరిగా లేదని సభ్యులు ఆరోపిస్తూ సభను వాయిదా వేశారు. సభ్యుల డిమాండ్ మేరకు గురువారం ప్రత్యేక మహాజన సభ ఏర్పాటు చేశారు. ప్రత్యేక సభలో సైతం కార్యదర్శి పొంతన లేని సమాధానాలు చెప్పడం పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ రిటర్న్స్ సకాలంలో ఎందుకు ఫైల్ చేయలేదని, సేల్ ట్యాక్స్ చెల్లించినప్పటికి రికవరీకి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. కార్యదర్శి అశ్రద్ధ, పాలకవర్గం అవగాహన రాహిత్యంతో సంఘం భవిష్యత్తు నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లెక్కలు సరిగా చూపడానికి 13 రోజులు సమయం తీసుకుని మళ్లీ అసంపూర్తి సమాచారంతో మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో సారి సభ ఏర్పాటు చేసి ప్రయోజనమేమిటని ప్రశ్నించారు. బాధ్యుల నుంచి గోల్‌మాల్ జరిగిన నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. అనారోగ్య కారణాల రీత్యా అధ్యక్షుడు గైర్హాజరయ్యారు. ఉపాధ్యక్షుడు పవన్ కుమార్ అధ్యక్షతన సభ జరిగింది.

బస్సు, ఆటో ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రంలో మహారాష్ట్ర బస్సు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ గాయాలయ్యాయి. గురువారం రాత్రి బస్సు మహారాష్ట్ర వైపు వెళ్తుండగా.. ఆటో సాలూర నుంచి బోధన్ వైపు వస్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన ఆటో డ్రైవర్ అంబాదాస్‌ను చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికు తరలించారు.

మరో ఘటనలో లారీ, కారు ఢీ..

వేల్పూర్: వేల్పూర్ సమీపంలో బుధవారం రాత్రి లారీ, కారు ఢీకొని వేల్పూర్‌కు చెందిన ఏలేటి గంగారెడ్డికి గాయాలైనట్లు ఎస్సై వినయ్‌కుమార్ గురువారం తెలిపారు. ఏలేటి గంగారెడ్డి తన కారులో ఆర్మూర్ నుంచి వేల్పూర్‌కు వెళ్లుండగా మోతె నుంచి ఆర్మూర్ వైపు ఎర్రజొన్నలు తీసుకెళ్తున్న లారీ ఢీకొట్టిందని ఆయన చెప్పారు. కారులో ఉన్న గంగారెడ్డికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమ తెరల పంపిణీ

బోధన్: రెంజల్ మండలం కందకుర్తి ఉర్దూమీడియం జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం కాంగ్రెస్ నేత కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి యువ సేన ఆధ్వర్యంలో విద్యార్థులకు దోమ తెరలను పంపిణీ చేశారు. హెచ్ఎం కరీం, ఎడపల్లి మాజీ ఎంపీపీ భాస్కర్ ఉన్నారు.

కొనసాగుతున్న నిర్మాణ పనులు

బోధన్‌టౌన్(బోధన్): మున్సిపల్ పరిధిలో భారీగా నిధులు వెచ్చించి అధునాతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పట్టణ పరిధిలో 38 వార్డులు, 17,500 వరకు నివాస గృహాలు ఉన్నాయి. పట్టణ జనాభా లక్షా 30 వేలకు పైగా ఉంటుంది. పట్టణానికి పాత బస్టాండ్ సమీపంలో 50, 60 ఏళ్లకు ముందు ఏర్పాటు చేసిన కూరగాయాల మార్కెట్ ఇప్పటికీ కొనసాగుతుంది. దీంతో పాటు ప్రతీ ఆదివారం వారాంతపు సంత సాగుతుంది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా సంత స్థలం లేకపోవడంతో ప్రతీ ఆదివారం ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపై విక్రయాలు జరపాల్సి వస్తోంది. ప్రజలు అనేక సార్లు సంత ఇబ్బందుల గురించి ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే, శక్కర్‌నగర్(ఎన్ఎస్ఎఫ్ భూమి)లో రెండెకరాల్లో రూ.7.21 కోట్లతో సమీకృత కూరగాయాల మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. అలాగే పాత బస్టాండ్‌లో పండ్ల వ్యాపారుల కోసం రూ.90 లక్షలతో ఏర్పాటు చేసిన భవన సముదాయంతో పండ్ల వ్యాపారులకు ఊరట లభించింది. అంతకుముందు అక్కడ అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని అధికారులు సూచించారు. 19 షెట్టర్లను ఇప్పటికే బల్దియా అధికారులు, వ్యాపారులకు లాటరీ పద్ధతిలో అప్పగించారు.

రూ. 21 కోట్లతో శాశ్వత భవనం

పన్నెండేళ్ల క్రితం బోధన్‌కు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేశారు. మంజూరైనా భవనం అందుబాటులో లేకపోవడంతో తాత్కాలికంగా మధు మాలాంచ జూనియర్ కళాశాలలో తరగతులు కొనసాగిస్తున్నారు. కేంద్రీయ విద్యాలయం శాశ్వత భవనానికి పట్టణ శివారులో 7 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. శాశ్వత భవన నిర్మాణం కోసం కేంద్రం రూ.21 కోట్లు కేటాయించింది. కేటాయించిన నిధుల నుంచి ముందుగా రూ. 5 కోట్ల విడుదల చేయడంతో నిర్మాణ పనులను ప్రారంభించారు.



బోధన్ పట్టణంలో పిల్లర్ల దశలో సమీకృత మార్కెట్

ప్రమాదంలో కార్మికుల ఉద్యోగ భద్రత



మాట్లాడుతున్న నాయకులు

బోధన్: బీజేపీ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ, ఉపాధి భద్రత ప్రమాదంలో పడిందని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసు ఆరోపించారు. స్వతంత్ర భారతదేశంలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ సర్కారు హరిస్తోందని, నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులకు తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. గురువారం బోధన్ పట్టణంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులు ప్రధానంగా ఎదుర్కొంటున్న అంశాలపై జాతీయ మహాసభల్లో చర్చించనున్నామని వెల్లడించారు. ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజులపాటు తిరుపతిలో జరుగనున్న ఇఫ్టూ జాతీయ మహాసభలకు అన్నీ రంగాల కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు దాల్ మల్క పోశెట్టి, వెండి శంకర్, శివకుమార్ పాల్గొన్నారు.

ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ కార్యాలయం ప్రారంభం



నందిపేట్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్సైలు శ్రీకాంత్ , పుష్ప, తదితరులు

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ) కార్యాలయాన్ని నిజామాబాద్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందిపేట ఎస్సై శ్రీకాంత్, నిజామాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై పుష్ప, ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ మహిళా విభాగం జిల్లా చైర్మన్ వీణారాణి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్ప, వీణా రాణి మాట్లాడుతూ.. భార్యను వేధింపులకు గురి చేయడం నేరం అన్నారు. వరకట్నం కింద వేధిస్తే 304(బి) సెక్షన్ కింద ఏడేళ్లకు తక్కువ లేకుండా శిక్ష విధిస్తారన్నారు. ఆత్మహత్యకు ప్రేరేపిస్తే సెక్షన్ 306 ప్రకారం శిక్ష, జరిమానా ఉంటుందన్నారు. అలాగే ప్రసవానికి ముందు గర్భంలోని శిశువును చిదిమేస్తే మూడేళ్ల జైలు, జరిమానా ఉంటుందని తెలిపారు. అలాగే వరకట్నం ఇచ్చిన, తీసుకున్న వ్యక్తులకు వరకట్న నిషేధ చట్టం కింద ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా ఉంటుందని అన్నారు. ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి న్యాయ సహాయం కావాలన్న తమ సహకారాన్ని అందిస్తామని తెలిపారు. అలాగే పలువురు ప్రసంగించారు.

సైన్స్ లాబ్ నిర్మాణానికి భూమి పూజ

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో భవనం నిర్మించడానికి ముందుకు వచ్చారు. బోధన్ ఎమ్మెల్యే మమ్మద్ షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా సమక్షంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రజిత యాదవ్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అభయ ఫౌండేషన్ వారు ల్యాబ్ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఏసీపీ కిరణ్ కుమార్, ఎంపీపీ శ్రీనివాస్, ఎడపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల మాధవి, పాఠశాల ప్రిన్సిపల్ సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.



సమాచారం..

నేడు బోధన్‌లో ఇఫ్తార్ విందు

బోధన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారికంగా స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణ కేంద్రంలోని రెంజల్ బేస్ ప్రాంతంలోగల ఫసిచమాన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు బోధన్ ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్ గురువారం తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు, మీడియా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

16న ఆర్మూర్‌లో సీపీఐ సమావేశం

ఆర్మూర్‌టౌన్: సీపీఐ నిజామాబాద్ జిల్లా కమిటీ సమావేశం ఆర్మూర్‌లో ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు పార్టీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు గురువారం తెలిపారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర నాయకురాలు పశ్య పద్మ హాజరవుతున్నట్లు వెల్లడించారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

బోధన్/పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్, రెంజల్ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు ప్రవీణ్ కుమార్, బలరామ్‌లు గురువారం వేర్వేరుగా తెలిపారు. మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరే విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతిలో చేరే విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అలాగే పరీక్షకు హాజర య్యే విద్యార్థులు తప్పకుండా మాస్కులు ధరించాలని సూచించారు.

17 నుంచి విద్యార్థులకు ఉచితంగా శిక్షణ

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2023 ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఈ నెల 17 నుంచి మే 15వరకు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఎస్ఎస్‌సీ హాల్ టికెట్, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు జత చేసి https://polycet.sbtet.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.